క్లుప్తంగా

ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల ఏర్పాటుపై పరిశీలన

తెనాలి: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా సీసీఎల్ కంపెనీ సహకారంతో ఏర్పాటుచేయనున్న సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పోలీస్ అధికారులతో కలసి ఎనిమిది సిగ్నల్ పాయింట్లను గుర్తించిన విషయం తెలిసిందే. ఆయా ప్రదేశాల్లో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుపై బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ సాంకేతిక నిపుణులు, పోలీసు అధికారులతో కలిసి ఆయా పాయింట్లను పరిశీలించారు. ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ శివరామ్, అవుతు నగేష్‌రెడ్డి, అచ్యుత సాంబశివరావు, శ్రీనునాయక్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే పీఏ సునీల్ పర్యవేక్షించారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

తెనాలి: సూపర్‌స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతిని బుధవారం తెనాలిలో అభిమానులు జరుపుకున్నారు. స్థానిక చినరావూరులోని సత్యనారాయణ మున్సిపల్ పార్కు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెనాలి నుంచి సినీ రంగానికి వెళ్లి హీరోగా దర్శకుడిగా, సినీ నిర్మాతగా, పద్మాలయ స్టూడియోస్ అధినేతగా ఎదిగిన వైనాన్ని గుర్తుచేసుకున్నారు. కృష్ణ సినీ జీవితంలోని మైలురాళ్లను స్మరించుకున్నారు. సాహసానికి మరోపేరుగా కీర్తించారు. కృష్ణ ఫాన్స్ మైక్ మురళీకృష్ణ, పరిశ వెంకటేశ్వరరావు, తాడిబోయిన కృష్ణ, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు, నాయుడు శ్రీను, కాళిదాసు సత్యం, సాయి (పంతులుగారు), షేక్ కరీమ్, కంచర్లపాలెం రాజు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

తెనాలి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మొవ్వా సత్యనారాయణ ప్రదర్శనను ప్రారంభించారు. లక్కరాజు లక్ష్మణరావు, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వాకా పేరిరెడ్డి, ఈఎల్‌వీ అప్పారావు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారిణి కావూరి రమాదేవి పర్యవేక్షించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కొల్లిపర: విద్యార్థులంతా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు కొల్లిపర శాఖా గ్రంథాలయంలో గుదిబండి వారిపాలెం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బి.సాంబిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, వంగా కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెనాలిరూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ కాలేషా, హైస్కూల్ ఉపాధ్యాయుడు రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెడ్పీ హైస్కూలు విద్యార్థులు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

కొలకలూరులో..

తెనాలిటౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు రూరల్ మండలంలోని శాఖాగ్రంథాలయంలో కొనసాగుతున్నాయి. కొలకలూరులోని శాఖాగ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత, ఉపాధ్యాయులు బాలునాయక్, విజయలక్ష్మి, ఏస్తేరు, పాల్గొన్నారు. నందివెలుగులోని శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పుస్తక ప్రదర్శన జరిపారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బొల్లు మాధవి, విక్టోరియా స్కూల్ ప్రిన్సిపల్ ఝాన్సీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ఘనత జగనన్నదే

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఏ సమస్యా లేకుండా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవనం గడపాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. అందుకోసమే రాష్ట్రంలో పేదరికం నిర్మూలనకు పూనుకున్నారనీ, పెత్తందారులపై ఒంటరి పోరుకు సన్నద్ధమయ్యారని చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రజలందరి అభివృద్ధి, సంక్షేమ రథమే జగనన్న ప్రగతి పథంగా దేశచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న జగనన్న ప్రగతి పథం ర్యాలీ పోస్టర్‌ను ఎమ్మెల్యే శివకుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వందలకొద్దీ అలవికాని హామీలను ఇవ్వటం, తీరా ఎన్నికల్లో గెలిచాక మేనిఫెస్టోను మాయం చేయటం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిందని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితిని సమూలంగా మార్చివేసిన ఘనతను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దక్కించుకున్నారని చెప్పారు. 2019 ఎన్నికల్లో ప్రతిపక్ష నేత హోదాలో కేవలం రెండు పేజీలతో మేనిఫెస్టోను విడుదల చేసి, ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన రోజునుంచి గడచిన 53 నెలల కాలంలో చిత్తశుద్ధితో అమలుచేసి చరిత్రను సృష్టించినట్టు తెలిపారు. మరే ఇతర ముఖ్యమంత్రికి సాధ్యం కాని రీతిలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని సమపాళ్లలో చేసి చూపిస్తున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులంతా గర్వపడేడలా సుపరిపాలన అందిస్తున్నందునే ప్రజలంతా మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో 18వ తేదీ నుంచి జరగనున్న ప్రగతిపథం ర్యాలీ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ నయవంచన పాలనకు, వైఎస్సార్ సీపీ సుపరిపాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉందన్నారు. ఈ తేడాను పూర్తి వాస్తవాలతో సహా వివరిస్తూ ప్రగతిపథం ముందుకు సాగుతుందని వివరించారు. విజయవంతం చేయాలని కోరారు. గుంటూరు జిల్లా ఐటీ విభాగ అధ్యక్షుడు మాదాసు కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిష్కరణలో జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నాలాది ప్రభాకర్, గుంటూరు ఐటీ వింగ్ కమిటీ సభ్యులు కె.శ్రీకాంత్‌రెడ్డి, దాసరి శ్రీకాంత్ యాదవ్, షేక్ అబ్దుల్ సలాం, మద్దు ప్రవచనబాబు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

సద్గుణాలతోనే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు

- హక్కులే కాదు..ప్రాథమిక బాధ్యతలను గుర్తెరగాలి
- ఆదర్శ దంపతుల పురస్కార స్వీకర్త కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి

తెనాలి: మనిషిగా పుట్టినందుకు జన్మతః వచ్చిన కొన్ని రుణాలను తీర్చుకోవటం బాధ్యత అని కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి అన్నారు. తల్లిదండ్రులు, గురువులు, సమాజం నుంచి మనం పొందినవన్నీ రుణాలుగా చెప్పారు. వీటిపై మన బాధ్యతను నెరవేర్చటమే పౌరులుగా మన విధి అన్నారు. తెనాలికి చెందిన పావులూరి ట్రస్ట్ 16వ వార్షికోత్సవ వేడుకను బుధవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఏవీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటర్‌లో ఘనంగా నిర్వహించారు. వివేక డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదర్శ దంపతుల పురస్కారాన్ని కేవీచౌదరి– పున్నమ్మ దంపతులకు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీత కేవీ చౌదరి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నేటి కాలంలో వృద్ధుల సంరక్షణను ప్రభుత్వమే చూసుకోవటం మంచిదని కొందరు చెబుతున్నట్లు తెలిపారు. పుణ్యభూమి భారతదేశంలో ఇంతటి దౌర్భాగ్య స్థితి వచ్చిందనుకుంటే ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సిందేనని అన్నారు. పురస్కార ప్రదాత జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఏరంగంలో ఎక్కడ స్థిరపడినా తల్లిదండ్రులను ప్రేమాభిమానాలతో చూసుకోవాలని సూచించారు. సభలో 'తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు' అనే అంశంపై విశ్రాంత ప్రిన్సిపాల్, రచయిత్రి వెలువలోలు నాగరాజ్యలక్ష్మీదేవి ధార్మికోపన్యాసం చేశారు. రామినేని ట్రస్ట్ వ్యవస్థాపకుడు ధర్మ ప్రచారక్ మాట్లాడుతూ, పావులూరి ట్రస్ట్ మన సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలను చేపట్టటం అభినందనీయమన్నారు. శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారదకు ఆత్మీయ పురస్కారం అందజేశారు. పావులూరి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. తొలుత పావులూరి సరోజినీదేవి– బాపయ్యచౌదరి చిత్రపటాలకు పుష్పాంజలి సమర్పించారు. ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ బొల్లేపల్లి సత్యనారాయణ ఆశీస్సులు అందజేశారు. పావులూరి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పావులూరి భానుమూర్తి పర్యవేక్షించారు.



కేవీ చౌదరి, పున్నమ్మ దంపతులకు ఆదర్శ దంపతుల పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం

ఆటోనగర్‌లో చోరీ

తెనాలిరూరల్: మండలం సోమసుందరపాలెం పరిధిలోని ఆటోనగర్‌లో చోరీ ఘటన బుధవారం వెలుగు చూసింది. ఆటోనగర్‌లో ఇంజన్ ఆయిల్ డీలర్ ఎస్కే ఖాసింకు చెందిన దుకాణంలో చోరీకి పాల్పడ్డ దుండగులు రూ.1.20 లక్షల నగదును అపహరించుకు వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ మాలేపాటి హరిప్రసాద్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఏడో వార్డులోని కొత్తపేట–1 సచివాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందారని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, వై ఏపీ నీడ్స్ కార్యక్రమ కన్వీనర్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు మాట్లాడారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్దిదారుల జాబితా బోర్డును చైర్మన్ ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేసు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సచివాలయంలో లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్మన్ మాలేపాటి

సంక్షేమ ప్రదాతకు మద్దతుగా నిలుద్దాం

మున్నంగి(కొల్లిపర): రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీపీ భీమవరపు పద్మావతి కోరారు. బుధవారం మండలంలో మున్నంగి గ్రామంలో గ్రామ సచివాలయ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరిగ చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సభలో పోతిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ అండగా దండగా నిలుస్తున్నారన్నారు.దేశ చరిత్రలోనే ఇటువంటి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకూ చూడలేదన్నారు.వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తొలుత సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్టికను ప్రజానాయకులతో కలసి ఆవిష్కరించారు. గ్రామంలో నాయకులు పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో సర్పంచి వేమూరి ధీనమ్మ, పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఆరిగ చంద్రారెడ్డి, మాజీ మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

కంచర్లపాలెంలో...

తెనాలిటౌన్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి మళ్లీ జగనే కావాలని మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు ధర్మరాజుల చెన్నకేశవులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 'జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలం కంచర్లపాలెంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయంలో అభివృద్ధి పథకాలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కోపల్లె మణిమ్మ, ఎంపీటీసీ సభ్యులు చెన్నకేశవులు, వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సురేష్, బొల్లినేని బుజ్జి, కొరివరపు దేవయ్య, పంచాయతీ కార్యదర్శులు వినయ్‌బాబు, శ్రీనివాసరావు, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

నేడు నాజర్‌పేటలో వై ఏపీ నీడ్స్ జగన్

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని నాజర్‌పేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాజర్‌పేట సచివాలయం వద్ద సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.









నేడు ఎంపీపీ ఎన్నిక

చెన్నకేశవులకు పార్టీ బీ–ఫారం అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్



తెనాలిటౌన్: తెనాలి మండల పరిషత్ నూతన అధ్యక్షుని ఎన్నిక గురువారం కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే ప్రత్యేక సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు కొత్త ఎంపీపీగా కంచర్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు ధర్మరాజుల చెన్నకేశవులను ఎన్నుకోనున్నారు. మండల పరిషత్ అధ్యక్షుడినిగా పనిచేస్తున్న గుడివాడ ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయిన శ్రీనివాసరావు అక్టోబర్ 5వ తేదీన ఎంపీపీ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వనజ ఎన్నికను నిర్వహించనున్నారు. 21 ఎంపీటీసీలకుగాను 18 మంది వైఎస్సార్ సీపీ అభ్యర్థులు, ఒకరు టీడీపీ, ఇద్దరు జనసేన అభ్యర్థులు గెలుపొందారు. మండల పరిషత్ అధ్యక్ష పదవి వైఎస్సార్ సీపీ అభ్యర్థి చేపట్టారు. ఆనాడు జరిగిన ఒప్పందంలో భాగంగా రెండేళ్ల తరువాత మరో అభ్యర్థికి ఎంపీపీ పదవిని ఇస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రకటించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు జరిగే ప్రత్యేక సమావేశానికి ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని కోరుతూ నోటీసులు అందజేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

కొల్లిపర: సహకార సంఘంలో తీసుకున్న రుణాలు రైతులు, వ్యాపారస్తులు సకాలంలో చెల్లించటం వలన సహకార సంఘం అభివృద్ధితో పాటు రైతులకు ఎక్కువ శాతం రుణాలు ఇవ్వటం జరుగుతుందని తెనాలి సొసైటీ డివిజన్ డెప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో–ఆపరేటివ్ పి.నిర్మల అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొల్లిపర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రంలో సొసైటీ చైర్‌పర్సన్ బొంతు శ్రీనివాసరెడ్డి, సీఈఓ గుదిబండి శివనాగిరెడ్డి, జీడీసీసీ బ్యాంకు మేనేజర్ షేక్ బాజీబాబా, కొల్లిపర మండల కో–ఆపరేటివ్ ఆఫీసర్ నాగూర్‌బేబీ , డైరెక్టర్లు భీమవరపు రవీంద్రరెడ్డి, రెడ్డి శివనాగిరెడ్డి, రైతులు కృష్ణారెడ్డి, చిన్నరామిరెడ్డి, సిబ్బంది సురేష్, లక్ష్మారెడ్డి, పూర్ణారెడ్డి పాల్గొన్నారు.